# ఓట్ల కోసం కోట్లతో వస్తున్న వారిని ఓడించాలి

- బీఆర్ఎస్ గెలుపు ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలి
- బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే బాల్క సుమన్

రామకృష్ణాపూర్, నవంబర్ 14: ఓట్ల కోసం కోట్లాది రూపాయలతో వచ్చే వారిని ఓడించాలని, నిత్యం ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కృషి చేసే సామాన్యుడినైన తను గెలిపించాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని విప్ బాల్క సుమన్ స్వగృహంలో మంగళవారం చెన్నూరు నియోజకవర్గ స్థాయి యువ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, నాయకుడు డా. రాజా రమేశ్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహ ప్రతి వ్యూహాలపై, సోషల్ మీడియా వినియోగంపై యువకులకు దిశానిర్దేశం చేశారు. బాల్క సుమన్ మాట్లాడుతూ ఈ నెల 27న మంత్రి కేటీఆర్ చెన్నూరు పర్యటన విజయవంతం చేయాలని కోరారు. 20వేల బైక్‌లతో నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. నమ్ముకున్న నాయకులను క్యాడర్‌ను మోసం చేసిన దుర్మార్గుడు వివేక్ అని ఆరోపించారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా పదవిని కట్టబెడితే పార్టీని మోసం చేశాడని, ఇప్పటికీ జాతీయ పార్టీగా బీజేపీ మ్యానిఫెస్టో విడుదల చేయకపోవడానికి కారణం వివేక్ చేసిన మోసమేనని తెలిపారు. రేటెంత రెడ్డి దగ్గర రూ.100 కోట్లతో సీట్ కొనుక్కొని కుటుంబ సభ్యులతో, సోషల్ మీడియా వేదికగా, సొంత న్యూస్ ఛానల్, పేపర్‌తో దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. చెన్నూరు గడ్డపై ఓటు లేని, ఇల్లు లేని వివేక్ వెంకటస్వామి చెన్నూరు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడని తస్మాత్ జాగ్రత్త అని ప్రజలకు తెలిపారు. ఉస్మానియా గడ్డపై నేను తిన్న లాఠీ దెబ్బల వాతలు ఇంకా తగ్గలేదని, నాది ఇనుప గుండె ఉక్కునరాలని తెలిపాడు. ఓట్ల కోసం కోట్లు వేసుకొని వస్తున్న కోటేశ్వరుడిని ప్రజలు ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. కాకా వెంకటస్వామి చివరి రోజుల్లో కేర్ హాస్పిటల్‌లో నుంచి పెయిడ్ నర్సులతో సేవలు అందించిన నీచపు చరిత్ర వివేక్ కుటుంబానిదని తెలిపారు. కాని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కాకా వెంకటస్వామి జయంతిని అధికారికంగా నిర్వహించడమే కాకుండా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహం ప్రతిష్ఠించి గౌరవించారని గుర్తు చేశారు. యువకులు ప్రభుత్వ పథకాల ప్రచారాన్ని విస్తృతం చేసి గడపగడపు చేరవేసి ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. కాంగ్రేసు గుండా రాజకీయాలను, రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఓపిక పట్టాలని, సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. నా గెలుపులో మీ గెలుపు చూసుకుంటాను. ఎవరెన్ని కుట్రలు చేసినా బాల్క సుమన్ గెలుపును ఆపలేరని అన్నారు. 15 రోజులు నాకోసం ప్రచారం చేయాలని, జీవితాంతం మీకు సేవ చేస్తానని తెలియచేశారు. వివేక్ కుటుంబానికి ఇక్కడ కొత్త పరిశ్రమలు స్థాపించకపోగా ఉన్నవి పోగొట్టారని తెలిపారు. 100 కోట్లతో సీట్ కొన్నవాడు 1000 వేయి కోట్లు సంపాదించాలని చూస్తాడని ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. వివేక్ చెన్నూర్ ప్రజలపై ప్రేమతో కాదు మోసం చేయాలనే కుట్రతో వస్తున్నాడని ప్రజలు ఆలోచించాలని సూచించారు. ఓపెన్ కాస్ట్ బావుల్లో, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో, జైపూర్ పవర్ ప్లాంట్‌లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోని నకిలీ విత్తనాల దొంగలు, ఇసుక దందాలు చేసిన వాళ్లు, సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల కోసం డబ్బులు వసూలు చేసిన వాళ్లు, 1/70 అమల్లో ఉన్న మందమర్రి పట్టణంలో అమాయక గిరిజనులను మోసం చేసి అక్రమంగా భూములు లాక్కున్న వాళ్లందరూ ఒకటయ్యారని తెలిపారు. గ్రామానికి 80 శాతం ఓట్లు వచ్చేలాగా పనిచేయాలిని, భారీ మెజారిటీతో గెలువబోతున్నామని తెలిపారు.



మందమర్రి : కాంగ్రెస్ నాయకుడు ముజాహిద్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

**బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు.**

మందమర్రి, నవంబర్ 14: మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండి.ముజాహిద్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ప్రస్తుత సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి, ఏఐసీసీ డేటా టెక్ మెంబర్ షిప్ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్న ముజాహిద్ ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం రాత్రి క్యాతనపల్లి మున్సిపాలిటీలోని స్వగృహంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవ వర్గ అభ్యర్థి, విప్ బాల్క సుమన్ సమక్షంలో పార్టీలో చేరారు. విప్ సుమన్ పార్టీ కండువా కప్పి ముజాహిద్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముజాహిద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో పదేళ్లు కష్టపడినా తగిన గుర్తింపు, కనీస గౌరవం ఇవ్వలేదని అందుకే రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంగల తిరుపతి రెడ్డి, మద్ది శంకర్, రాం వేణు, నవీన్, వేణు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**ర్యాలీగా తరలి వచ్చిన యువకులు**

మందమర్రి, నవంబర్ 14: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తన స్వగృహంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నియోజక వర్గ స్థాయి యువజన, విద్యార్థి, సోషల్ మీడియా నాయకుల యువ ఆత్మీయ సమ్మేళనానికి మందమర్రి మున్సిపాలిటీకి చెందిన యువకులు బైక్‌లతో ర్యాలీగా భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మందమర్రి పట్టణంలోని బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర ఉపాధ్యక్షుడు బడికెల సంపత్‌లు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక రామన్ కాలనీ, పాతబస్టాండ్ మీదుగా క్యాతనపల్లి వరకు నినాదాలు చేస్తూ యువకులు తరలి వెళ్లారు.

**కోటపల్లి మండలం నుంచి..**

కోటపల్లి, నవంబర్ 14 : క్యాతనపల్లిలో నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా సమావేశానికి కోటపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు.



కోటపల్లి : బబ్బెరచెలుక నుంచి సమావేశానికి తరలుతున్న నాయకులు



మందమర్రి నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్

# అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- ఇంటింటా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



మందమర్రి : 12వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోటపల్లి : మల్లంపేట గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, నవంబర్ 14: ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మరో సారి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. చెన్నూర్ పట్టణంలోని 1వ వార్డులోని కోటబొగుడ, బోయవాడ, శివాలయం వీధి, జెండావాడ, కాపువాడల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు దోమకొండ అనిల్, జగన్నాథుల శ్రీను, జోడు శంకర్, త్మమ రమేశ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు అయూబ్, కేవీఎం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఖాజా ఖంరొద్దీన్, మానికరౌతు శంకర్, మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ 1 వార్డు ఇన్‌చార్జి వీరమల్ల రాము, బీఆర్ఎస్ నాయకులు చెన్న శ్రీకాంత్, కొమ్మెర నవీన్, పెండ్యాల లక్ష్మణ్, నెన్నల భీమయ్య, జడల మల్లేశ్, కొండపర్తి వెంకటరాజం, ఖలీల్, కోమటిపల్లి రమేశ్, ధరణి సంతోష్, మేడ సురేశ్‌రెడ్డి, తగరం అశోక్, రాసపాక శ్రీశైలం, తగరం సంపత్, వేముల మహేందర్, ఆరీఫ్, గడ్డం కిరణ్, లాపాక నారాయణ, ముత్యాల సత్యవతి, చీర్ల సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిలో విస్తృతంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం..**

మందమర్రి, నవంబర్ 14: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 11, 12, 15, 18, 24వ వారుల్లో ఒకటవ జోన్, పాలచెట్టు ఏరియా, దీపక్ నగర్, ఊరు మందమర్రి, రామన్ కాలనీ, అంగడిబజార్ ఏరియాలలో బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కోటపల్లి మండలంలో..**

కోటపల్లి, నవంబర్ 14 : కోటపల్లి మండలంలోని పారుపల్లి, మల్లంపేట గ్రామాల్లో సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన బాల్క సుమన్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మందమర్రి : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు



కోటపల్లి : పారుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



ఆర్థికసాయంఅందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, నవంబర్ 14: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన సంఘటన మందమర్రి పట్టణంలో మంగళవారం జరిగింది. పాలచెట్టు ఏరియాలో గల శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నివసిస్తున్న గండికోట రవి నిత్యం కూలీ పనులు చేస్తూ భార్య ముగ్గురు కూతుళ్లతో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధం కావడంతో బాధిత కుటుంబ సభ్యులు రోదించిన తీరు పలువురు అని కలచి వేసింది. సంఘటన స్థలాన్ని మండల తహసీల్దార్ చంద్రశేఖర్ సందర్శించి పరిశీలించారు.

**అగ్ని ప్రమాద బాధితలకు బాల్క ఫౌండేషన్ చేయూత**

మందమర్రి పట్టణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్ట పోయిన బాధిత కుటుంబానికి బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వెంటనే స్పందించి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు అండగా ఉండాలని నాయకులకు తెలిపారు. బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి కెంగర్ల మల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, సీనియర్ నాయకులు మద్ది శంకర్, నలువాల సమ్మయ్య, పల్లె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.